వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 14 మే 2023


# నీరుగట్టు వారి పల్లెలో హత్య

## మామను చంపిన అల్లుడు



మదనపల్లె క్రైం, మే 13 ప్రభాతవార్త :

నీరుగట్టు వారి పల్లికి చెందిన హరికృష్ణ.. పావని దంపతులకు గొడవ విషయంలో సర్ది చెప్పపోయినా విషయంలో అల్లుడు హరికృష్ణ మామ అయిన శ్రీనివాసులును పొడిచి హత్య చేయడం జరిగింది.. గత కొద్దీ రోజులుగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నా కారణం గా నేడు పావని తండ్రి అయిన శ్రీనివాసులు వెలిగల్లు గ్రామం నుండి పెద్ద మనుషుల ద్వారా పంచాయతీ చేస్తూ ఉండగా అల్లుడు హరికృష్ణ కత్తెరతో మామను, భార్య అయిన పావని పైన దాడి చేయడంతో పావనికి సొల్ప గాయాలు అయ్యాయి.. ఈ సంఘటన లో మామ శ్రీనివాసులు మరణించారు... మదనపల్లి 2వ పట్టణపోలీస్ వారు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.. హత్య చేసిన హరికృష్ణ పరారిలో ఉన్నాడని పోలీస్ అధికారులు తెలిపారు...

# టూరిజం మేనేజర్‌పై హత్యాయత్నం

మదనపల్లెక్రైం, మే 13 ప్రభాతవార్త:



గాయపడిన రఫిక్

భూవివాద గోడవల్లో భాగంగా టూరిజం మేనేజర్‌పై అతని మేనమామ కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. బాధితుని కథనం మేరకు పట్టణంలోని ప్యారానగర్‌కు చెందిన రఫిక్‌అహ్మద్(33) విజయవాడలోని ఏపి టూరిజంశాఖలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో బికేపల్లి కాలనీలో తాత మగ్బూల్‌సాబ్ ఇచ్చిన స్థలంలో ఇళ్ళు నిర్మిస్తుండగా మేనమామ హుస్సేన్ అడ్డుకొన్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. కాగా మగ్బూల్‌సాబ్ కుమార్తె హబీబాగేగం కుమారుడు రఫిక్ అన్నారు. ఈ క్రమంలో తాత ఇచ్చిన స్థలంలో ఇంటినిర్మాణాన్ని అడ్డుకొన్నాడని ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఆవేశానికి గురైన హుస్సేన్ కత్తితో రఫిక్‌అహ్మద్‌పై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ పోలీసులు చెప్పారు.

# రోడ్డు ఆక్రమణలపై సర్వే

పుల్లంపేట, మే 13 ప్రభాతవార్త

పుల్లంపేట మండల కేంద్రం నుంచి చిట్వేలికి వెళ్లే రోడ్డు పుల్లంగేరు నుంచి రోడ్డు ఆక్రమణలను గుర్తించడానికి సర్వే కార్యక్రమాన్ని మండల సర్వేయర్ బృందం తమ పనులను ప్రారంభించింది. ఈ మేర కు గురువారం నుంచి పుల్లంగేటి నుంచి కొలతలను ప్రారంభించడం జరిగింది. ఈ రోడ్డులో సిమెంట్ రోడ్డును వేయడానికి వీలుగా రోడ్డుకు ఉన్న ఆక్రమణలను తొలగించడానికి కొలతలు తీస్తున్నట్లు చుట్టుపక్కల నివాసం ఉన్నవారికి తెలిపనట్లు సమాచారం. ఈ మేరకు 2 రోజుల క్రితమే డప్ ద్వారా రోడ్డుకిరువైపుల ఉన్న కుటుంబాలవారు ఇళ్లల్లోనే ఉండాలని చెప్పడం జరిగింది. అయితే పుల్లంపేట బస్టాప్ బైపాస్ నుంచి చిట్వేలి రోడ్డులో పుల్లంగేరు వరకు పుల్లంపేట దళితవాడ దగ్గర కడప - తిరుపతి హైవే బైపాస్ నుంచి పుల్లంపేట మండల కేంద్రం గుండా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే దారి వరకు, సిమెంట్ డబల్‌రోడ్డును వేయాలని గత ఐదారు సంవత్సరాలుగా అనుకుంటున్నా రోజు రోజుకు అది వెనుకబడిపోతూ ఉండేది. అయితే ప్రస్తుతం ఈ ఆక్రమణల గుర్తింపు కార్యక్రమాన్ని రెవెన్యూశాఖ సర్వేయర్ బృందం కలిసి కొలతలు తీసే మిషన్లతో గుర్తిస్తుండడంతో ఈ రోడ్డుకు మోక్షం వస్తుందా అని పలువురు అనుకుంటున్నారు. నియోజకవర్గంలో పుల్లంపేట మండల కేంద్రం గత 50 సంవత్సరాలుగా ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉండటం జరుగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యంగా రోడ్డు విస్తరణ కార్యక్రమాలకు నోచుకోకపోవడం విశేషం. గతంలో మంజూరైన ఆ రోడ్డును అప్పటి ప్రజా ప్రతినిధులు చిట్వేలికి తీసుకుపోయారని ప్రచారం కూడా జరిగింది. అయితే ఇప్పు డైనా అబివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారా అని అనుకుంటున్నారు. ఏది ఏమైనా మండల కేంద్రంలో నాలుగు పక్కల రోడ్లను ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపడితే మండల కేంద్రంలోకి రావడానికి, వాహనాలు రాక పోకలు కొనసాగించడానికి కొంత అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే మెయిన్ రోడ్డు పూర్తిగా మూసుకుపోయి ఆక్రమణలకు గురికావడంతో పగటిపూట కూడా వచ్చే ఆర్డినరి ఆర్‌టిసి బస్సులు కొని తిరుపతి-రాజంపేట వెళ్లేవి బైపాస్‌గుండానే వెళ్లిపోతున్నాయి. దాంతో వికలాంగులు, వృద్ధులు మండల కేంద్రంలోకి వెళ్లాలం టే ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని అధిగమించాలం టే ముందు ఆక్రమ ణలను తొలగించాలని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా



చిట్వేలి రోడ్డులో ఈ పనులు ప్రారంభించడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామంలో మెయిన్‌రోడ్డులో కూడా ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆసమర్ధ విధానాలతో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కు

## ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం నుంచి పారిపోతున్న పారిశ్రామిక వేత్తలు

## మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి

గాలివీడు, మే 13 ప్రభాతవార్త :



వైసిపి ప్రభుత్వ అసమర్థ, ఆరాచక, విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనుకబడి పోయిందని మాజీ ఎమ్మెల్యే రాయచోటి రమేష్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. ఆయన శనివారం మండలంలోని గాలివీడు పంచాయతీలో బాధ్యుడే బాదుడు, రచ్చ బండ, ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక అసమర్ధ విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడుతున్నారని, అంతేకాక ఉన్న పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం లో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులందరూ ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళుతున్నారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని నలమూలల పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నదని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గత టీడీపి ప్రభుత్వ మ్ రైతులకు అవసరమైన పైపులు స్పింకలార్లు డ్రిప్పులు మోటార్ల ఎరువులు విత్తనాలను సబ్సిడీ రూపంలో అందించి ఆదుకున్నదని తెలిపారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికి వెళ్లిప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, మాజీ వర్క్ఫ్ బోర్డ్ నెంబర్ మహబూబ్ బాషా క్లస్టర్ ఇంచార్జ్ సత్య రెడ్డి, మండల టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి ,జక్రియ ,వీర రాఘవులు మీ టే నాయక్ శేఖర్ రెడ్డి . తదితరులు పాల్గొన్నారు.

# ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి

## - పుట్టా సుధాకర్ యాదవ్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్.

బ్రహ్మంగారి మఠం, మే 13 ప్రభాతవార్త :

మండలంలోని ముడమాల గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వైసీపీ పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకునేందుకు మైదుకూరు టీడీపి ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఆయన ప్రజల అభిప్రాయాలను సేకరించి రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయం అని, వైసీపీ ప్రభుత్వం మన రాష్ట్రానికి ఖర్మ లాగా పట్టి పీడిస్తోందని, రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో మంచి రోజులు వస్తాయని ప్రజలతో అన్నారు. వైసీపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు, ఇసుక, డీజల్, సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, యువతకు నిరుద్యోగ సమస్య, అభివృద్ధి లేని రాష్ట్రంగా ఈ ప్రభుత్వం నియంతృత్వ పోకడగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, గొడ్లవీడు మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, చౌదరివారిపల్లె రామసుబ్బారెడ్డి, మిల్లు శ్రీను, యర్రంపల్లె వీరయ్య, చౌదరివారిపల్లె మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేలాది బైకులతో ఘనంగా హనుమాన్ శోభయాత్ర

మైదుకూరు మే 13, ప్రభాతవార్త



మైదుకూరు పట్టణంలో గల శ్రీ అంకాలమ్మ ఆలయం వద్ద నుండి వేలాది బైకులతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిం చారు. హనుమాన్ జయంతి హిందువులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఇది హనుమంతుడు జన్మించిన రోజును తెలియజేస్తుంది. హనుమం తుని జన్మ వృత్తాంతం, శివ పురాణం, రామాయణం మొదలైన పురాణ గ్రంథాలలో అనేకానేక గాథలతో వివరించడమైనది. హనుమంతుడికి ఆంజనే యుడు, మారుతి, హనుమ, వాయుపుత్రుడు, అంజనీసుతుడు, బజరంగీ, కేసరీనం దన, పవన తనయ వంటి అనేక పేర్లు ఉన్నాయి. అయితే హనుమంతుడు శ్రీరామ బంటుగా, రామదూతగా ప్రసిద్ధి. హిందూ పురాణాల ప్రకారం, హనుమంతుడు శ్రీరామునికి అత్యంత గొప్ప భక్తుడు, తన గుండెల నిండా శ్రీసీతారాములను నిండుగా దాచుకున్న దాసుడు. శ్రీరాముని పట్ల హనుమకు ఉన్న అచంచలమైన భక్తిని ఆయన భక్తులు సైతం ఆరాధిస్తారు. హనుమాన్ జయంతి హనుమంతుని సద్గుణాలను తెలియజేసే ప్రాముఖ్య తను కలిగి ఉంటుంది. హనుమంతుడు ధైర్యం, విధేయత, విశ్వాసం, నమ్మకం, భక్తి, నిస్వార్థత, చురుకుతనం, తెలివి వంటి గొప్ప గుణాలను కలిగి ఉన్నాడు. హనుమాన్ జయంతి రోజున భక్తులు హనుమంతునికి విశేషమైన పూజలు చేస్తారు, హనుమాన్ చాలీసా పఠిస్తారు, రామనామ జపం చేస్తారు. ఈ పవిత్ర మైన రోజున మైదుకూరు పట్టణం నందు గల వనిపెంట రోడ్డులో గల అంకా లమ్మ గుడి వద్దనుండి రాయల్ కూడలి, కడప రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, నంద్యాల రోడ్డు నుండి తిరిగి అంకాలమ్మ గుడి వద్దకు చేరుకొని యాత్ర ముగించారు,ఈ శోభాయాత్రలో మహిళా మూర్తులతో పాటు దాదాపు 1000 బైకులు పాల్గొన్నాయి. ఆర్ఎస్ఎస్‌నాయకులు బలరాంనాయక్ ప్రశంగించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి

## మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపు

గాలివీడు, మే 13 ప్రభాతవార్త :



సమాజంలో రక్తదానం చేయడం ఇతరులకు ప్రాణదానం చేసినట్లు అని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి అన్నారు. సంబేపల్లి మండలం నారాయణ రెడ్డి గారి పల్లె లో శనివారం కీర్తిశేషులు గొడ్లిండ్ల శ్రీనాథ్ జ్ఞాపకార్థం అజయ్ అశోక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పలు రకాల రోడ్డు ప్రమాదాలు గర్భవతులు ఇంత వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో చాలామందికి రక్తం అవసరం ఏర్పడుతుంది. అలాంటి సమయంలో యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఆ రక్తం ఇతరులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాంప్రసాద్ రెడ్డి అన్నారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వారంతా రక్తదానం చేయవచ్చని సంవత్సరానికి నాలుగు సార్లు చొప్పున రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని ఎలాంటి అపోహలకు తావు లేకుండా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం శ్రేయస్కరం అన్నారు కొత్త రక్త కణాలు మూడు నుంచి నాలుగు వారాల్లో ఏర్పడతాయన్నారు. రక్తం పెరగాలంటే ఆకుకూరలు బెల్లం తీయని పెరుగు మొలకెత్తిన విత్తనాలు క్యారెట్ అంజీర లాంటిది తీసుకోవాలని రాంప్రసాద్ రెడ్డి సూచించారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం అశోక్, బాల, సురేందర్ రెడ్డి, కొండారెడ్డి, అజయ్, ఓం ప్రకాష్, మరి కొందరు రక్తదానం చేశారు. దీప బ్లడ్ బ్యాంక్ దాతల నుంచి రక్తాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, బిందు రెడ్డి, శంకర్ రెడ్డి, సుదర్శన్, రవీంద్ర నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, నరేంద్ర, నరేష్, కాంట్రాక్టర్ ఆంజనేయులు మాజీ ఎంపిటీసీ మదన మాజీ సర్పంచులు వెంకట్రాంరెడ్డి రంగస్వామి, రమణయ్య, కొండారెడ్డి, రాజు సురేందర్ రెడ్డి, ఆంజనేయు లు రెడ్డి గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# హార్సిలీహిల్స్ అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి

## - కలెక్టర్ గిరీష పీఎస్



బి.కొత్తకోట, మే 13, ప్రభాతవార్త:

ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ అభివృద్ధే లక్ష్యంగా అధికార యంత్రాంగం పని ఏయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ ఆదేశించారు. శనివారం ఆయన హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పర్యాటకుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హార్సిలీ మిల్స్‌లో సాహస క్రీడలకు తగు ఏర్పాట్లు తీసుకోవాలని అదేవిధంగా ట్రిక్కింగ్ కార్యక్రమాలు నిర్వహించడానికి చర్యలు చేపట్టాలన్నారు. హార్సిలీహిల్స్ లోని పర్యాటకులు చూడదగిన ప్రదేశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత అభివృద్ధి కోసం నిపుణులతో కలిసి పరిశీలించారు. ఏటీవీ వెహికల్స్, రాప్లింగ్, కార్యక్రమాలపై కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కొండపై పర్యాటకులకు విడిది చేయడానికి వీలుగా అనువైన సౌకర్యాలతో పాటు చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా ఇక్కడికి వచ్చే పర్యాటకుల సేవలు సందర్శకులను ఆకట్టుకునేలా మరింత అభివృద్ధి చేయాలని వారిని కోరారు. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో హార్సిలీహిల్స్ అభివృద్ధికి కృషి చేసి రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆయన వెంట మదనపల్లె ఆర్డీవో మురళీ, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం, రెవెన్యూతో పాటు అన్ని రకాల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేడింగ్‌లో గందరగోళం

## - డీవో కట్టేది ఒక గ్రేడ్‌కు.. లోడింగ్ చేసేది కెమికల్ గ్రేడింగ్‌కు

## - కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు కుదిరిన లోపాయికారి ఒప్పందాలు

ఓబులవారిపల్లె, మే 13, ప్రభాతవార్త:



మంగంపేట ఏపీఎండీసీ ప్రాజెక్టులో తవ్వేకొద్ది నిగ్గు తేల్చే నిజాలు బయట పడుతున్నాయి. ఇటీవల కాలంలో ముగ్గురాయి అక్రమ తరలింపు ఒక ఎత్తయితే గ్రేడుల్లో గందరగోళం మొదటికొచ్చిందనే చెప్పవచ్చు. ఏది ఏమైనా గనిలో నుంచి ఏ+1, ఏ+2 ఏ గ్రేడు మరియు కెమికల్ గ్రేడ్ ఖనిజాలు గని నుంచే లోడింగ్ చేసి సీఅండ్‌డీ పేరు మీద డీవోలు కట్టిన రసీదులతో నేరుగా సీఅండ్‌డీ స్టాక్ పాయింట్ వద్ద తోలి లోడింగ్ చేసి ఆ తరువాత సీ అండ్ డీ గ్రేడింగ్‌పై కెమికల్ ఏ గ్రేడ్ ఖనిజాన్ని కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులు సిండికేట్ లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని కెమికల్ గ్రేడ్ తరలిస్తున్నారని సమాచారం. ఇది ఒక ఎత్తయితే డీవోలు మార్చి అక్రమ దందాకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా ఇదే తంతు జరుగుతున్నా జియాలజీ అధికారులకు తెలిసినా నోరు మెదపలేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక్కడ కంపెనీ యజమానులకు, ఉద్యోగులకు సమన్వయ లోపంతోనే పర్యవేక్షణ లోపాల వల్ల ఇలా ముగ్గురాయి గ్రేడింగ్‌లో గందరగోళం నెలకొని ప్రతి రోజు 10 నుంచి 20 టిప్పులు ముడుపులు అందించిన ఎక్స్‌పోర్టర్లకు పల్వరైజింగ్ యజమానులకు తరలిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఏపీఎండీసీ అధికారులు పునరాలోచించి అక్రమ ముగ్గురాయి తరలింపును అడ్డుకోకపోతే సంస్థకు కోట్లాది రూపాయలు నష్టాల్లో కూరుకుపోక తప్పదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

## జిల్లా సర్వే అధికారి జయరాజ్

నందలూరు, మే 13 ప్రభాతవార్త



ఆలయ భూములను పరిశీలిస్తున్న జిల్లా సర్వేయర్ జయరాజ్

నందలూరు మండలంలోని పాటూరు పంచాయతి పరిధిలో ఉన్న కన్నేశ్వర ఆలయం వద్ద సర్వేనంబరు 930 లోని 7.86 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేశారని అన్నమయ్యజిల్లా కలెక్టర్‌కు ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా శనివారం జిల్లా సర్వే అధికారి జయరాజ్ జిల్లా ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్‌తో కలిసి నందలూరుకు రావడం జరిగింది. నందలూరు మండల తహశిల్దారు వైఎస్ సత్యానంద్ వారితో కలిసి సంఘటన స్థలానికి పాటూరు సర్వేయర్‌ను పిలిపించి సమస్యలపై పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సర్వే అధికారి జయరాజ్ మాట్లాడుతూ 930 సర్వేనంబరులో 7.86 ఎకరాల భూమి ఉందని, ఇది ప్రభుత్వ భూమా లేక ఆలయానికి సంబంధించిన భూమినా అని పరిశీలించి అందులో 7 ఎకరాల వరకు ఎటువంటి కబ్జాకు గురి కాలేదు అని, మిగిలిన 86 సెంట్లు కబ్జా చేసినట్లు మాకు వచ్చిన సమాచారం మేరకు 930 సర్వేనంబర్లు పరిశీలించామని దీనిపై పూర్తి నివేదికపై అధికారులకు అందజేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దారు మోహన్‌కృష్ణ, మండల ఇన్‌ఛార్జి సర్వేయర్ ఓబయ్య, విఆర్ ఒ రాఘవ, పాటూరు సర్వేయర్, సర్పంచ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో

# జిల్లా వ్యాప్తంగా 12876 కేసులు పైగా పరిష్కారం





కడప లీగల్, మే 13, ప్రభాతవార్త:

జాతీయ న్యా సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. కడపలో 5, ప్రొద్దుటూరు 3, రాయచోటి 3, రాజంపేట 1, బద్వేలు 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులలో ఒక్కొక్క బెంచీని ఏర్పాటు చేయడం జరిగిందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సి.ఎస్.మూర్తి, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి గీతా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ భార్గవి, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డిలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12876 కేసులకు పైగా పరిష్కరించడం జరిగిందని రూ. 2,36,42,291 మొత్తం కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు.జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, రవాణాశాఖాధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంక్, చిట్‌ఫండ్, లేబర్ శాఖ, మున్సిపల్, ఇతర అధికారులకు వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు మరియు ఎం.ప్రదీప్‌కుమార్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ, ఫుల్ అడిషనల్ ఛార్జ సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు కృతజ్ఞతలు తెలిపారు.

## బడులు తెరిచిన రోజే

# జగనన్న విద్యాకానుక కిట్లను అందించాలి

## కలెక్టర్ విజయరామరాజు

కడప, మే 13 ప్రభాతవార్త :



ఈ విద్య సంవత్సరం పాఠశాలలు ప్రారంభించిన రోజే.. విద్యార్థులకు నాణ్యమైన "జగనన్న విద్యా కానుక" కిట్లను పంపిణీ చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. శనివారం జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "జగనన్న విద్యా కానుక" మండల స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్ కుమార్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో ఉన్న టెక్ట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీస్ తోపాటు యూనిఫారం దుస్తుల నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలు ఓపెన్ చేసిన మొదటి రోజే విద్యార్థులకు అందజేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. 2023 -24 విద్యా సంవత్సరంకు సంబంధించి వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 1,58,156 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా మూడు జతల యూనిఫామ్స్, రెండు జతల సాక్సులు, బ్యాగు, బెల్టు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీస్ ఇవ్వబోతున్నామని అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత తాహసిల్దార్లకు, ఎంపీడీవోలకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష పీఓ డా. ఏ. ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, తాహాసిల్దార్ గంగయ్య, ఎంపీడీవో రవికుమార్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు మిట్ట కేశవరెడ్డి, కొండా దశరథరామిరెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట వేడుకలు

వార్త II వ పేజీలో

# రాజీమార్గమే రాజ మార్గం : న్యాయమూర్తి

వార్త IV వ పేజీలో

## ఉన్నత చదువులకు అండగా ఉంటా : చంద్రబాబు

### - పది ఫలితాల్లో 2వర్యాంక్ విద్యార్థినికి భరోసా

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



2023 పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించిన వికాస్ స్కూల్ విద్యార్థిని బి.లక్ష్మీచేతన, వికాస్ స్కూల్ కరస్పాండెంట్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా ఉండవల్లిలోని వారి నివాసంలో శనివారం కలవడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు విద్యార్థిని సన్మానించి తన ఉన్నత చదువులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పేద కుటుంబంలో పుట్టినప్పటికీ చదువుపై మక్కువ ఏ స్థాయిలో ఉందో ఈ మార్కులు చూస్తేనే అర్థమవుతుందని మరిన్ని విజయాలు సాధించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు.

## కారు యజమానికి కారు అప్పజెప్పాలి

### - బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



ముద్దనూరుకు చెందిన శివసాయి చందు కారును అతనికి తిరిగి ఇవ్వాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ తెలిపారు. శనివారం కడప వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జమ్మల మడుగు నియోజకవర్గం ముద్దనూరు గ్రామ నివాసి మంజుల శివసాయి చందుకు చెందిన కారు ఈనెల 6వ తేదీ జమ్ములమడుగు ఎమ్మెల్యే అనుచరుడు రామలింగా రెడ్డి ఫంక్షన్‌కు వెళ్లాలని కారు అవసరం ఉందని తీసుకెళ్లడం జరిగిందని తెలి పారు. తీసుకున్న కారు తిరిగి ఇవ్వకుండా మీ నాన్న నాకు అప్పు బాకీ ఉన్నాడని తిరిగి ఇచ్చేది లేదని బెదిరించడం సరైంది కాదన్నారు. ఈ మేరకు ముద్దనూరు సీఐ దగ్గరకు వెళ్లి న్యాయం చేయాలని కోరగా సీఐ కూడా వారికే వత్తాసు పలుకు తున్నారని ఒక తెల్ల కాగితంపై సంతకం పెడితే కారు ఇప్పిస్తానని చెప్పడం దారుణమన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## 2003 డీఎస్సీ వివరాలు ప్రభుత్వానికి పంపాలి

కడప ఎడ్యుకేషన్, మే 13, ప్రభాతవార్త:

సెప్టెంబరు 2004 ముందు నోటిఫికేషన్ ఉపాధ్యాయ వృత్తికి ఎంపిక అయిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల జాబితాను వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అలీఖాన్, చెంగల రెడ్డి, జిల్లా విద్యాశాఖలను డిమాండ్ చేశారు. సంవత్సరం క్రితమే సదరు వివరాలు రాష్ట్ర విద్యాశాఖ అడిగినా రాష్ట్రంలో కొన్ని జిల్లా విద్యాశాఖ కార్యాల యాలు ఇప్పటి వరకు పంపించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల తాజా ఉత్తర్వుల మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు అందరూ కూడా ఓపీఎస్ పరిధిలోకి తొందరలో రానున్నారని తెలిపారు. తాము చేసిన ఉద్యమాలు ఫలితం దక్కనుందని తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరచంద్ర, వీరప్రసాద్, సత్యం, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మజ, వెంకట సుబ్బయ్య 2004కు ముందు నియామక పత్రాలు పొంది ఆలస్యంగా ఉద్యోగాలలో చేరిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల జాబితాను కూడా రాష్ట్ర ప్రభుత్వానికి కచ్చితంగా పంపాల్సి న అవసరం ఉందని జిల్లా విద్యాశాఖను కోరారు. దీంతో వీరికి కూడా పాత పింఛను వర్తించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కచ్చితంగా వివరాల ను సకాలంలో పంపాల్సి న బాధ్యత ఉందన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజా విజయం

### - రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆదాం

కలికిరి, మే 13, ప్రభాతవార్త:



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం ప్రజా విజయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఆదాం అన్నారు. కర్ణాటకలో మత తత్వాలను ప్రేరేపించే బీజేపీకి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారన్నారు. గాంధీ కుటుం బంపై ఉన్న ప్రేమ, నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని ఆయన పేర్కొన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగిస్తుందని ఆదాం పేర్కొన్నారు. ముస్లిం, మైనార్టీలను పేదలను ఆదుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మరోసారి కర్ణా టకలో ప్రజలు రుజువు చేశారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## కోదండరామాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట వేడుకలు

ప్రొద్దుటూరు మే 13, ప్రభాతవార్త



స్థానిక వసంతపేట వీధిలో వెలసిన నూతన శ్రీ కోదండ రాముని దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా రెండో రోజు శని వారం వేదమంత్రోచ్ఛరణతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి దేవత పూజలు జపపారాయణాధులు యంత్రాభిషేచనము దీక్ష హెూమాలు గణపతి సుబ్రహ్మణ్య సర్వతో భద్ర నవగ్రహ పూజలు చండీ హెూమాలు తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. కూర్మ యంత్ర ప్రతిష్ట తదుపరి ధ్వజ శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవము అంగరంగ వైభవంగా జరిగాయి సాయంత్రం ఐదు నుండి జపపారాయణాధులు దీక్ష హెూమాలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమం నిర్వహించిన వారిలో మార్తల రామచంద్రారెడ్డి గురు శేఖర్ రెడ్డి మార్తల మునిరెడ్డి మల్లికార్జున యాదవ్ దేవిరెడ్డి చిన్నిరెడ్డి మేరువ ప్రసాద్ హరీష్ జి లక్ష్మీనారాయణ అనిల్ రెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి చంద్ర బద్వేల్ గురువు రెడ్డి పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కురబలకోట, మే 13 ప్రభాతవార్త :



వేసవికాలంలో విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కురబలకోట గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. గ్రంథాలయాల్లో ప్రతిరోజు బుక్స్‌రీడింగ్, స్పోకన్ ఇంగ్లీస్, కథలు, డ్రాయింగ్ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలకు విచ్చేసి ఈ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాజీమార్గంతోనే కేసులకు పరిష్కారం

వాల్మీకిపురం, మే 13 ప్రభాతవార్త:



రాజీమార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలని జడ్జి శిరీష అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ లోక్అదాలత్‌లో 97 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. రూ 8,27,003లును రికవరీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనందకుమార్, న్యాయవాదులు అశోక్‌కుమార్, ద్వారకనాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, వివిధశాఖల అధికారులు, మండల స్థాయి సేవా సంస్థ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## మనబడి, నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయండి

### కలెక్టర్ విజయ రామరాజు

కడప మే 13, ప్రభాతవార్త



"మనబడి నాడు-నేడు" క్రింద రెండవ దశలో జరుగుతున్న అభి వృద్ధి పనులను పాఠశాలల రీ ఓపెనింగ్ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబందిత అధికారులను ఆదేశించారు. శని వారం చింతకొమ్మదిన్నె మండలంలోని జమాల్ పల్లి కొత్తపల్లిలో "మనబడి నాడు-నేడు" ద్వారా రూ.2.5 కోట్ల నిర్మిస్తున్న 19 అదనపు తరగతి గదులను.. జేసీ గణేష్ కుమార్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డు తూ జిల్లా వ్యాప్తంగా 1006 ప్రభుత్వ పాఠశాలు, అంగన్వాడీ సెంటర్ల తోపాటు జూనియర్ కాలేజీల్లో రూ.290 కోట్లతో "మనబడి నాడు-నేడు" రెండవ దశ పనులు జరుగుతున్నాయని.. ఈ పనులన్నింటినీ నాణ్యతా ప్రమా ణాలతో సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్క డైనా నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారుల పైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. పాఠశాలలు పునఃప్రారంభం (జూన్ నెల 12వ తేదీ) నాటికి అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రాఘవ రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష పీఓ డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, తహసిల్దార్ గంగయ్య, ఎంపీడీవో రవికుమార్ రెడ్డి, ప్రధా నోపాధ్యాయులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## వైసిపి అవినీతి పాలనపై బిజెపి చార్జిషీట్ నమోదు

ప్రొద్దుటూరు మే 13, ప్రభాతవార్త



ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టి పాలన కొనసాగించినప్పటి నుండి ఎమ్మెల్యేలు వారి అనుచరులు చేసిన దౌర్జన్యాలు దాడులు అవినీతి అధికార యంత్రాంగం అందించిన సహకారంతో రాష్ట్రంలో ఏర్పడిన అధ్వాన్న పరిస్థితులపై ప్రజా కోర్టులో బిజెపి అభియోగ పత్రం నమోదు చేసినట్లు బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు తెలి పారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు ఆయన బిజెపి శ్రేణులతో కలిసి స్థానిక తాసిల్దార్ నజీర్ అహ్మద్‌కు అభియోగ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రొద్దు టూరును అభివృద్ధి పరుస్తున్నానని గొప్పలు చెప్పుకోవడం తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే ప్రొద్దుటూరులో ఉన్న జిల్లా కార్యాలయాలు తరలించి ఎమ్మెల్యే అభివృద్ధి నిరోధకుడుగా మిగిలారని విమర్శించారు. వైసిపి నాయకులు పంచాయతీల పేరుతో దందాలు, దాడులు చేసి వారిపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ల్యాండ్ మాఫియా పెట్రేగి పోయిందని తెలిపారు. జగనన్న కాలనీల కోసం జరిగిన భూసేకరణలో కోట్లాది రూపాయలు అక్రమాలు జరిగాయన్నారు. విజయ దుర్గ గోడౌన్ కొను గోలు చేసి ఇంతవరకు నష్టపోయిన రైతులకు చెల్లించని ఎమ్మెల్యే పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కర్నాటి ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు పి సుబ్రహ్మణ్యం రాజుపాలెం మండల కన్వీనర్ రామసుబ్బయ్య సోషల్ మీడియా గొర్రె కృష్ణ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

### టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు మే 13, ప్రభాతవార్త



ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని టిడిపి ఇన్చార్జి జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని 32 వ వార్డు లోని పవర్ హౌస్ రోడ్డు మున్సిపల్ ఆఫీస్ రోడ్డు లో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అవినీతి అరాచకం దౌర్జన్యాలతో జగన్ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆయన జోష్యం చెప్పారు. ఈ కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, పట్టణ అధ్య క్షులు ఇవి సుధాకర్ రెడ్డి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, ఖలీల్ భాషా, నాయబ్ భాష, డిసిఎస్ఆర్ దాదా పీర్, వెలవలి జాకీర్, మేరువ మూర్తి, పెన్నా నగర్ మజీద్, గోపవరం గౌస్, భగత్ సింగ్ కాలనీ పట్నం మా భాష, శివ, పగిడాల కన్నయ్య, చిన్న, ఈశ్వర్ రెడ్డి నగర్ చలమయ్య, రామచంద్రారెడ్డి మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు మే 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రొద్దు టూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిం దన్నారు. 53 కోట్లతో నూతన కూర గాయల మార్కెట్ నిర్మాణం 120 కోట్లతో రక్షిత మంచినీటి పథకం 53 కోట్లతో పెన్నా నది రామేశ్వరం ఆర్టిపిపి రహ దారిపై హైలెవెల్ వంతెన, వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాలకు మౌలిక వసతుల ఏర్పాటుకై మొదటి విడత 65 కోట్లతో అభివృద్ధి పనులు. నాలుగు కోట్లతో గాంధీ పార్క్ అభివృద్ధి పనులను చేపట్టామని త్వరలో 25 కోట్లతో ఆర్ట్స్ కాలేజీ నూతన భవనముల నిర్మాణం కళాశాల అభివృద్ధి పనులు 160 కోట్లతో పట్టణంలోని ప్రధాన ఐదు మురుగునీటి కాలువల ఆధునీకరణ 120 కోట్లతో పైపులైన్ల మార్పు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూస్తూ ప్రతిపక్షాలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కాలం ఉన్నందున ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయాలని వైరి పక్షాలకు ఆయన హితవు పలికారు.

## బీసీలకు చేస్తున్న ద్రోహంపై పోరుబాట..

### - యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు యాదవ్

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



బీసీలకు ప్రభుత్వం చేస్తున్న ద్రోహంపై ఈనెల 18 నుంచి 22 వరకు పోరుబాట చేస్తున్నట్లు టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నర సంవత్సరాల పాలనలో అత్యంత తీవ్రంగా నష్టపోయి దగాకు గురైంది బీసీలే అని ఆయన మండిపడ్డారు. టీడీపీ తెచ్చిన బీసీ సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేసి 75వేల కోట్ల బీసీ నిధులనుదారి మళ్లించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. విదేశీ విద్యను లేకుండా బీసీ వెన్నుపోటు పొడిచిన ముఖ్యమంత్రి జగన్‌కు తగిన మూల్యం తప్పదన్నారు. బీసీలపై అరాచకాలకు పాల్పడి 26 మంది బీసీ నేతలు హత్యకు గురయ్యారన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేసిన జగన్‌ను గద్దె దింపి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో యాదవ సాధికార కమిటీ సభ్యులు నూకబోయిన నరసింహ యాదవ్, సభ్యులు శ్రీను యాదవ్, పార్వతి యాదవ్, కిరణ్, నరసింహులు యాదవ్, భాస్కర్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటి ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు అర్బన్ మే 13, ప్రభాతవార్త



జేఎన్టీయూ అనంతపురం వారు ఎంబీఏ రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్ మార్చ్ 2023లో నిర్వహించిన పరీక్ష ఫలితాలలో సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యింజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యా ర్థులు అర్జున్ కుమార్ 77.6 శాతం, మహేశ్వరి 76.8, గీతికా 76.1 శాతం మార్కులు సాధించి కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పాడురంగ రవి తెలిపారు. ఈ సంద ర్భంగా ఉత్తను ఫలితాలను సాధించిన విద్యార్థులను చైర్మన్ బసి రెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకట్ శ్వర్ రెడ్డి,అకడమిక్ డీన్ సుబ్బారెడ్డి,హెచ్ ఓడి షబానాబీ అధ్యాపకులు అభినందించారు.

## మహిళలను వేధిస్తున్న వారిని అరెస్టు చేయాలి

### - సీపీఐ నాయకుల డిమాండ్

ఓబులవారిపల్లె, మే 13, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలో కొంత మంది మహిళలను బీజేపీ నాయకులు వేధిస్తున్నారని వారిని వెంటనే అరెస్టు చేయాలని మహిళా సమైక్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం సీపీఐ నాయకులు మండల సమైక్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిన్నఓరంపాడు పంచాయతీలోని చిన్నఓరంపాడు, గోవిందంపల్లె పంచాయతీలకు సంబంధించిన మహిళా సమైక్య జిల్లా కార్యదర్శులు మర్రి సుమిత్రమ్మ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి వారు సంతకాలు సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచినందుకు ఆ రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపు తున్నామని కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపాలదేవి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరి గాళ్ల శాంతయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు శనివారం పటాకులు కాల్చి కేక్ కటింగ్ చేసి అందరికి పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోసాల దేవి, శాంతయ్యలు మాట్లాడుతూ ఈ గెలుపుతో రాహుల్ గాంధీ పాద యాత్ర ఒక ఎత్తయితే అక్కడ సిద్ధి రామయ్య, శివకుమార్ కలిసి మెలిసి పని చేయడం మరో ఎత్తన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రధానిగా రాహుల్ గాంధీ అవుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, మహిళా నాయకురాలు రాణి, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సిగమాల శివ, బొమ్మి రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోరుమామిళ్ళలో కాంగ్రెస్ సంబరాలు

పోరుమామిళ్ళ రూరల్, మే 13ప్రభాతవార్త:



కర్నాటలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో శనివారం బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి విజయోత్స వ సంబరాలను జరుపుకున్నారు. ఈ నెల 10వ తేదీన జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుబి మోగిస్తుందని, అన్ని సర్వేలు వెల్లడించిన ప్రకారంగానే కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటి విజయం సాధించింది. ఇదే విషయాన్ని రానున్న తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికలలో సైతం సాధిస్తూ 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో కూడా ఈ పరంపర కొనసాగిస్తామని అన్వర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, మహబూబ్ బాషా, యూత్ కాంగ్రెస్ నాయకులు సలీం, ముజాహిద్, రఫీ పాల్గొన్నారు.

## లక్ష్మీమాధవ ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు బహూకరణ

మైదుకూరు మే 13, ప్రభాతవార్త



మైదుకూరు పట్టణం పాత ఊరిలో వెలసిన లక్ష్మీ మాధవ ఆంజ నేయ స్వామికి వెండి ఆభరణాలు బహూకరించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు తెలిపారు. మైదుకూరుకు చెందిన సోద్దల పెద్ద గురప్ప దంపతులు ఐదు లక్షల రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలు బహుకరించారన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు మాట్లాడుతూ సోద్దల గుర్రప్ప వెండి వస్తువులు విరాళంగా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బారాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ డైరెక్టర్ ఎలిశెట్టి ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సత్వరం నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

కురబలకోట, మే 13 ప్రభాతవార్త:



జగనన్న లేవుట్లలో లబ్దిదారులు పక్కాగృహాలను సత్వరం పూర్తి చేయాలని అన్నమయ్య కలెక్టర్ పిఎస్.గిరీషా అన్నారు. శనివారం కురబలకోట మండలం కంటేవారిపల్లె జగనన్నలేవుట్లలో చేపట్టిన పక్కాగృహాల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులతో మాట్లాడుతూ లేవుట్లలో కరెంటు, నీరు తదితర సదుపాయాలను కల్పించామని తెలిపారు. లబ్దిదారులు నిర్మాణాలను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన లబ్దిదారులకు శ్రీశక్తి గ్రూపుల ద్వారా రుణాలను మంజూరు చేయించాలని అధికారులు ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎంఎస్.మురళి, తహశీ ల్దార్ భీమేశ్వర్‌రావు, ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

దువ్వూరు, మే 13, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శనివారం గ్రేటర్ రాయలసీమ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఏపీ రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి సుమారు 25 జట్ల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నాయి. క్రీడా కారులతో వ్యవసాయ సలహాదారుడు పరిచయం చేసుకొని బాల్‌బ్యాడ్మింటన్ ఆడి క్రీడలను ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారు లకు వరుసగా రూ.25 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

దువ్వూరు, మే 13, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజు 30 మంది విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువు కుంటున్నారని రిటైర్డ్ ఉపాధ్యాయులతో పిల్లలకు కథలు, చెప్పించడం, ఆటలు ఆడించడం జరిగిందన్నారు. విద్యార్థులకు పోటీలు కూడా నిర్వహించడం జరిగిందని మరింత మంది విద్యార్థులు వచ్చేలా ప్రోత్స హిస్తున్నామన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో ఇదేం ఖర్మ కార్యక్రమం

పీలేరు, మే 13 ప్రభాతవార్త:



పీలేరులోని ఇందిరమ్మ కాలనీలో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పీలేరు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేర కు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు, ఇంటిపన్నులు, చెత్తపన్ను, ఆర్టీసి చార్జీలు పెంచి ప్రజలపై అద నపు భారాన్ని మోపాదన్నారు. రైతులకు వ్యవసాయ మోటార్లుకు మిటర్లు బిగించే కార్యమ్రకం చేపట్టి రైతుమెడకు ఉరితాగుగా మారనుందన్నారు. రాష్ట్రానికి పెట్టు బడులు రాక యువతకు ఉపాధిలేక నిత్యవసర ధరలు అదపు చేయలేక మూడు రాజదానుల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పురం రామ్మూర్తి, సురేష్ కుమార్ రెడ్డి, పసుపులేటి లక్ష్మీకర్, అమరనాథ్‌రెడ్డి, ఖాదర్, ముబారక్, వేంకటేశ్వర్లరెడ్డి, సిద్దారెడ్డి, చాకలి రెడ్డప్ప, అమరనాథ్‌రెడ్డి, కప్పంర చంద్రయ్య, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, మండల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## మత మార్పిడి అనంతరం పూర్వపు ఆస్థి పొందుటకు అనర్హులు

బద్వేలు లీగల్, మే 13 ప్రభాతవార్త :

హిందూ వారసత్వ చట్టం అమలులోకి రాక పూర్వం గానీ, వచ్చిన తరువాత గానీ ఒక హిందూ స్త్రీ అయినను, పురుషుడైనను హిందూ మతమును విడనాడి ఇతర మతమును స్వీకరించినచో అట్లు అన్య మతమును స్వీకరించిన పిదప అతనికి గానీ, ఆమెకు గానీ కలిగిన సంతానము, అట్టి సంతతి వారు కూడా తమ హిందూ మతావలంబులైన బంధువుల ఆస్థిని వారసత్వ రీత్యా పొందుటకు అర్హతను కోల్పోవుదురు. కానీ అట్టి అన్య మతావలంబుల సంతానమున్నూ, ఆ సంతానము యొక్క సంతతి వారున్నూ వారసత్వము దఖలుపడు తేదీ నాటికి హిందువులే అయినచో అట్టి అనర్హత లేకుండా పోవునని హిందూ వారసత్వ చట్టం 1956 సెక్షన్-26 సుస్పష్టంగా విశదపరుస్తోంది. అనగా ఈ చట్టం హిందువులకు వర్తింపచేయ ఉద్దేశింపబడినది కనుక హిందువుల ఆస్థిని అన్య మతావలంబులైన వారి సంతానము వారి సంతతియు కూడా పొందు అర్హతను కోల్పోవుదురు. ఇతర మతముల నుండి హిందూ మతము లోనికి మారుటకు అవకాశం ఉన్నది. వారసత్వము దఖలుపడు నాటికి అన్య మతావలంబులైన వారి సంతానము గానీ, ఆ సంతానము యొక్క సంతతి గానీ హిందువుగా మారి ఉండినచో ఈ ఆంక్ష తొలగిపోవును. అనగా వారసత్వము పొందుటకు అర్హుడగునని ఈ హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్-26 స్పష్టం చేస్తోంది. కావున మత మార్పిడి వ్యవహారములలో జాగరూకత వహించి ఆస్థులను కాపాడుకొనవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని దృగ్గోచరమగుచున్నది.

## బేకరిలో అగ్నిప్రమాదం

కడప క్రైం, మే 13, ప్రభాతవార్త:



కడప - కర్నూలు హైవే పక్కన చెన్నూరు గ్రామంలో కుందేటి తిరుపతయ్యకు చెందిన బేకరీలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. ఆయన వివరాల మేరకు ప్రమాదానికి గురైన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిప్రమాదాన్ని నివారించడం జరిగిందన్నారు. అగ్నిప్రమాదం వల్ల రూ.10లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లిందన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన వైఎస్ఆర్ బీమా పథకం

పెద్దతిప్ప సముద్రం మే 13, ప్రభాతవార్త



పెద్ద తిప్ప సముద్రం మండలంలోని పులికల్లు గ్రామపంచా యతీలో ఆ గ్రామంలో ఇటీవలే చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించడంతో ఆ కుటుంబానికి ఆదుకునే వైయస్సార్ బీమా పథకం ద్వారా లక్ష రూ.ఆర్థిక సహాయాన్ని చేరినట్లు స్థానిక సర్పంచ్ పూల గిరీష్ తెలిపారు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన మిట్టపల్లి కిట్టన్న (54) కుటుంబానికి వైయస్సార్ బీమా పథకం వర్తించిందని శనివారం రోజున మృతుని భార్య శంకరమ్మకు పదివేల రూపా యలను అందజేశామని త్వరలో మిగతా డబ్బు ఆమె అకౌంట్లో జమ అవు తుందని సర్పంచ్ పూల గిరీష్ తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ వైస్‌చైర్మన్ శ్రీనివాసులు. ఎంపీటీసీ వెంకట రమణమ్మ ముత్తన్న. గ్రామ కన్వీనర్ మధుకర్ రెడ్డి. గ్రామ సచివాలయ సిబ్బంది. వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ జయంతి వేడుకలు

సిద్దవటం, మే 13, ప్రభాతవార్త:

మండలంలోని భాకరాపేటలో వెలసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి గుడిలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారని గ్రామ పెద్దలు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి భాకరాపేట గ్రామంలో స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, గ్రామ ప్రజలు భక్తాదులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా గ్రామ పెద్దలు తెలిపారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

పోరుమామిళ్ళ రూరల్, మే 13ప్రభాతవార్త:



పోరుమామిళ్ళలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పటనికి పాలాభిషేకం చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చుక్కల భూములను 22 ఏళ్లలో ఉన్న భూములను నిషేధిత జాబితా నుండి తొలగించినందువల్ల లక్షలాది మంది రైతులు ఆనందాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పి. నాగార్జునరెడ్డి అడ్వైజర్ టు గవర్నమెంట్ పంచాయతీరాజ్ డెవలప్ మెంట్, నీటి సంఘం ప్రెసిడెంట్ ఓబన్న, కోటా ప్రసాద్, లక్కినేని ఓబయ్య, జె.కె. హుస్సేన్ పీరా, వార్డు మెంబర్ ఓబయ్య, మాజీ ఆర్మీ వెంకటసుబ్బయ్య, రమణ, మహిళలు కూడా పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## యువగళం పాదయాత్రలో దారపునేని చిన్నరాముడు

పోరుమామిళ్ళ రూరల్, మే 13ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ మండలం కమ్మవారి పల్లెకు చెందిన భారతీయ జనతా పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షులు దారపునేని చిన్నరాముడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు సమక్షంలో ఆత్మకూరులోని యువగళం పాద యాత్ర లో చేరడం జరిగింది. కార ్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల ప్రధాన కార్యదర్శి శివ శంకర్, బాలుడు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## బిజెపి పతనం ప్రారంభమైంది: సిపిఐ

పోరుమామిళ్ళ రూరల్, మే 13ప్రభాతవార్త:



దేశంలో నియంతృత్వ పరిపాలన సాగిస్తూ మతోన్మాద రాజకీయాలను చేసి అధికారం దక్కించుకోవాలనుకునే బిజెపి ప్రభు త్వానికి కన్నడ ప్రజలు సరైన గుణ పాఠం చెప్పారని, ప్రజాకంటక బిజెపి పాలనను తరిమికొట్టిన కర్నాటక రాష్ట్ర ఓటర్లకు సిపిఐ నాయకులు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా కార్యదర్శి జకరయ్య, పట్టణ కార్యదర్శి పిడుగు మస్తాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## కర్నాటక ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ సంబరాలు

మదనపల్లె, మే 13 ప్రభాతవార్త :



కర్నాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడం పట్ల శనివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. పట్టణ అధ్యక్షులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు బస్టాండు లోని ఇందిరా గాందీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల ఫలితాలే రాబోయే కేంద్రంలో జరిగే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. కన్నడ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టడం పట్ల వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, మహమ్మద్ అలీ, మహబూబ్‌పీర్, నూర్‌అహ్మద్, రఫి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామ కోటి జపయజ్ఞం

రామసముద్రం, మే 13 ప్రభాతవార్త :



మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన శ్రీరామ ఆలయంలో రవీంద్రారెడ్డి, వెంకటరత్నమ్మ కుమారుడు మదుసూదన్‌రెడ్డి, సునీత కుమార్తె స్వాతి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి భక్తిశ్రద్దలతో ఉపవాసాలతో శ్రీరామ కోటి జపయజ్ఞం నిర్వహించారు. సీతారాములకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిట లాడింది. అనంతరం వచ్చిన భక్తులకు మహా మంగళాహారతి ప్రసాదం వితరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## గడ్డివామికి నిప్పు పెట్టారని పోలీసులకు ఫిర్యాదు

రామసముద్రం, మే 13 ప్రభాతవార్త:

గడ్డివామికి నిప్పుపెట్టారని ఉలపాడు పంచాయితీ బూసాని కురప్పల్లెకు చెందిన మంజునాథ్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని ఊలపాడు పంచాయితీలో తాతల కానం నుంచి అనుభవంలో ఉన్న సర్వేనెంబర్ 155లో 0.5సెంట్లు భూమి సాగు చేసుకొంటున్నామని శనివారం తెల్లవారుజామున ఎవరూ లేనిసమయంలో గడ్డివామికి నిప్పుపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మా గ్రామానికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, సిద్దరాజు, రామచంద్ర, వెంకటరమణపై అనుమానం ఉన్నాదని పేర్కొన్నారు. వీరందరూ కలసి జేసిబితో మా స్థలంలోని వేపచెట్టు, రావిచెట్టును తొలగించి గడ్డివామి, పశువుల షెడ్డులకు నిప్పు పెట్టారని తెలిపారు. పక్కనే ఉన్న పాడి పశువుల షెడ్డు 5, ఆరులోడ్లు పశుగ్రామంకు ఎలాంటి ప్రదామంజరగలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని విచారించి తగు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు హనుమాన్ జయంతి

పీలేరు, మే 13 ప్రభాతవార్త:

పీలేరు-సదుం రోడ్డు మార్గంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నేడు హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ పూజరులు తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటలనుంచి 8.30గంటల మద్య హనుమాన్ మూలమూర్తికి రుద్రాభిషేకం, అత్రేక అలంకారం, అర్చన, మహామంగళహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6గంటలకు ఆకుపూజ, వడమాల సేవ, చతుర్వేద స్వస్థి, టిటిడి దేవస్థాన అన్నమయ్య ప్రాజెక్టు అన్నమాచార్యుల కీర్తనలు నిర్వహిస్తారిన పేర్కొన్నారు. సోమవారం 15న సాయంత్రం 3గంటలకు గరుడవాహనం, పురవీదుల గుండా ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు రాజస్వామి, ఆలయ ప్రధాన సభ్యులు నాగభూషణం తెలిపారు.

## మిట్స్‌లో రెండవరోజు అశ్వ్ 2కె23

కురబలకోట, మే 13 ప్రభాతవార్త:



మిట్స్‌లో రెండవ రోజు అశ్వ్ 2కె23 కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ కార్యక్రమాలు అల రించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో సంతోషంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, సినీహీరో సత్యదేవ్ సందడి ప్రధానంగా మారిందన్నారు. విద్యార్థులు అన్ని పోటీలలో పాల్గొని స్పోర్ట్స్‌లో ఉత్సాహాన్ని నింపారని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ప్రముఖ సింగర్స్ అరుణ కౌండిల్య, శృతి రంజని, శాండిల్య పాటలతో అలరించారు. జబర్దస్త్ అభినయ క్రిష్ణ స్కిల్‌తో సినిమా డైలాగులతో అలరించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఈడి కీర్తి నాదేళ్ళ, కె.శిశిర్‌మెంబర్ అకాడమిక్ కౌన్సిల్ ఎన్.ద్వారకనాథ్, అధ్యక్షులు ఆర్ఆర్ అకాడమి కన్వనర్ సమీనా, విభాగాదిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు, రేపు విశ్వనాథపురం తిరుణాల

### 15న బండలాగుడు పోటీలు

చాపాడు మే 23, ప్రభాతవార్త



మండల పరిధిలోని విశ్వ నాథపురం గ్రామం నందు ఆది , సోమ వారాలలో హనుమాన్ జయంతి సంద ర్భంగా తిరుణాల వైభవంగా నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆది వారం స్వామివారికి ప్రత్యేక పూజలు, సోమవారం వృషభ రాజములకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీలలో ప్రథమ బహుమతి చల్ల గంగయ్య, పెరు మాళ్ళ శివకుమార్ యాదవ్ 60 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి మేకల బాబు( మాజీ జెడ్పిటిసి చాపాడు) 50వేల రూపాయలు, తృతీయ బహుమతి మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి 40 వేల రూపాయలు, నాలుగు, ఐదు, ఆరు, ఏడవ బహుమతి కూడా ఇవ్వ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సీఐపీఈటీ డిప్లొమో కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, మే 13, ప్రభాతవార్త:

భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) వారు 2023-24 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమో మరియు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఐపీఈటీ.గో.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ) డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్ట్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణత మరియు చదువుతున్న విద్యార్థులు, 2 సంవత్సరాల వ్యవధిలో గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్సింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సుకు బీఎస్సీ పాస్ మరియు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి ఈనెల 28వ తేదీ లోపు విజయవాడ, అనంతపురం కేంద్రాలలో జూన్ 11వ తేదీ సీఐపీఈటీ అడ్మిషన్ టెస్ట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ కోర్సులందు చేరాలనుకునే విద్యార్థులు ఆర్.శ్రీను అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ 63001477965 నంబరును సంప్రదించాలని కోరారు.

## ఆర్థిక చేయూత కోసం ఎదురుచూపులు

కలికిరి, మే 13, ప్రభాతవార్త:



పేదరికం ఒక వైపు.. అనారోగ్యం మరో వైపు.. ఇలా జీవనంలో కష్టాలతో ఎదురీదుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న ఓ వివాహిత దీనగాథ ఇది.. వివరాల్లోకి వెళ్తే.. కలికిరి మండలం మర్రికుంటపల్లె రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న తనుకు చంద్రకళకు రెండు కిడ్నీలు పని చేయకపోవడంతో వైద్య చికిత్సలు చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డు పనిచేయక పోవడం తో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రకళది నిరుపేద కుటుంబం. భర్త శ్రీరాములు కూలి పనులకు వెళ్తేనే ఆ కుటుంబం గడుస్తుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇలాంటి తరుణంలో చంద్రకళకు రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్నారు. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. రెండు కిడ్నీలు మార్పిడి చేసేందుకు వేలూరు సీఎంసీకి చికిత్సల నిమిత్తం వెళ్తే అక్కడ రూ.13 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడం జరిగింది. దీంతో దాతలు తమకు సహాయం చేసి ప్రాణభిక్ష పెట్టాలని ఆమె వేడుకుంటోంది. దాతలు 9000998676 ఫోన్ పేనంబరు, కలికిరి బరోడా బ్యాంక్ ఖాతా నెం.16518100003106కు సహాయం చేయాలని వేడుకుంటోంది.

## ఘనంగా నరసింహస్వామికి పూజలు

గోపవరం,మే 13 ప్రభాతవార్త;



మండలంలోని వల్లెరవారి పల్లెకు సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి వైశాఖ మాసం నాల్గవ శనివారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. సమీప గ్రామాలనుంచి అదిక శాతం భక్తులు పాల్గొన్నారు. కన్నుల పండుగగా స్వామికి అలంకరణలు ఏర్పాటు చేసారు.హాజరైన భక్తులకు తీర్ద ప్రసాదాలను అంద చేసారు. ఆలయ పూజారి శ్రీ పెంచలయ్య ఆద్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వీడియో కాల్ ద్వారా సుదూర ప్రాంతంలోని అనేక మంది భక్తులు స్వామిని దర్శించుకొన్నారు. హైదరా బాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి హరిరామ్ ధర్మపత్ని ఉమామహేశ్వరి వీరి కుటుంబీకులు ఆలయం వద్ద అన్నదానానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందచేసారు. ఖాజీపేట తాహశీల్దారు రమణారెడ్డి శ్రీ స్వామివారిని దరి ్శంచుకొన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

## నేడు అభయాంజనేయ స్వామి 7వ వార్శికోత్సం

గోపవరం,మే 13 ప్రభాతవార్త;

మండలంలోని నెల్లూరు బద్వేలు రోడ్డులో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ఆదివారం వైభవంగా 7వ వార్ ్శకోత్సవాన్ని నిర్వహించనున్ననట్లు ఆలయ నిర్వహకులు సావిత్రి, చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైభవంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భకు_లు పాల్గొని ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. అన్నదానం ఉంటుందన్నారు. ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి దాత నాగేంద్రరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారం

గోపవరం,మే 13 ప్రభాతవార్త;

మండలంలోని రచాయిపేటలో మంచినీటి సమస్య పరిస్కారం అయింది. ఆగ్రామంలోని నీటి ట్యాంకును సుబ్రంచేసి స్వచ్చమైన నీటిని ప్రజలకు అందిస్తున్నారు. మంచి నీటి విషయం వార్తలో ప్రచురమైన విషయం తెలిసిందే.ఈ మేరకు ఆగ్రామ కార్యదర్శి నిఖిత ప్రత్యేక శ్రద్ద వహించి నీటి ట్యాంకును సుబ్రం చేయడమే కాకుండా ఆగ్రామ దళితవాడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### గడప గడపలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె, మే 13 ప్రభాతవార్త :



పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నవాజ్ బాషా తెలిపారు. శనివారం పట్టణం లోని 35వార్డులో రాజానగర్ సచివాలయ పరిధిలోరి కాట్లాటపల్లె రోడ్డు, ఆంజినేయ స్వామి గుడి వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న ప్రజాసమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. నవరత్నాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్ళి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైకాపా ప్రభుత్వాన్ని ఆదరించి మళ్ళీ ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలన్నారు. గతంలో ఎన్ని కల్లో ఇచ్చిన హామీల్లో కూడా 98శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్య మంత్రికి దక్కిందన్నారు. చేనేతల సంక్షేమం కోసం కూడా నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి, నూర్‌అజాం, కౌన్సిలర్లు ఎస్‌వి.రమణ, రామి శెట్టి శివయ్య, ఆర్‌వి.శివారెడ్డి, ఎంవి.రమణ, మేస్త్రీ శ్రీనివాసులు, కమీషనర్ ప్రమీల, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 15న పట్టణంలో టిడిపి ర్యాలీ

### మాజీ ఎమ్మెల్యే రమేష్

మదనపల్లె, మే 13 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర 15న సోమవారం నాటికి 100రోజులు పూర్తి చేసుకొం టున్న సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి పటేల్‌రోడ్డు, బెంగుళూరు బస్టాండు, అవెన్యూరోడ్డు, చిత్తూర బస్టాండుల మీదుగా నిమ్మనపల్లె సర్కిల్ వరకు ర్యాలీ చేపడుతా మన్నారు. అటునుంచి ఆర్టీసి బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడడం జరుగుతుం దన్నారు. ఈకార్యక్రమాన్ని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## కర్నాటకలో కాంగ్రెస్ విజయంపై హర్షం

పీలేరు, మే 13 ప్రభాతవార్త :



కర్నాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడం పట్ల శనివారం పీలేరులో కాంగ్రెస్ నాయకులు బాణసంచాపేల్చి సంబరాలు జరిపారు. ఏపిఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బాణసంచా పేల్చి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం బిజెపి పతనానికి నాంధి పలుకుతోందని తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రను ప్రజలు స్వాగతించారని తెలిపారు. కర్నాటక ఎన్నికల ఫలితాలే రాబోయే కేంద్రంలో జరిగే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతా రన్నారు. కన్నడ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టడం పట్ల వారికి అభినందనలు తెలిపారు. కర్నాటక విజయం మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపికి ప్రత్యేక హోదా కావా లంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సాయిసంతప్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూసఫ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగుంట్ల మే 13, ప్రభాతవార్త



సంక్షేమ పథకాలను ప్రజలం దరూ సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి ప్రజలను కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలోని ఆవరణలో ప్రజా దర్బార్ కార్య క్రమాన్ని నిర్వహించిన ఆయన ప్రజల నుండి వినతులను స్వీకరించి వాటిని అక్కడి కక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభి వృద్ధి సంక్షేమం మాకు రెండు కళ్ళలాంటివని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా 2023-24 డాక్టర్ వైయస్సార్ భీమా గుర్తింపు ప్రక్రియ ఈనెల 20 నుండి ప్రారంభమవుతుందని, జూన్ 13వ తేదీ కల్లా అమ్మఒడి జాబితా తయారవు తుందని అర్హులైన వారందరూ ఈ పథకాలకు వారి వారి సచివాలయాల్లో అప్లై చేసుకోవాలనిసూచించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మూలే సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఎర్రగుంట్ల మే 13, ప్రభాతార్త



కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించి, స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ మీడియా ఇం చార్జ్ జానకి రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందిం చిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లా డుతూ 2024 లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వస్తే మూడు లక్షల వరకు రైతు రుణమాఫీ, 500 రూపాయలకే వంట గ్యాస్, నిరుపేద కుటుంబాలకు 6000 వరకు ఆర్థిక సాయం, ప్రత్యేక హెూదా, కడప స్టీల్ ప్లాంట్ విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు స్పెషల్ ప్యాకేజీ లాంటి ఆరు సూత్రాల పథకం అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎర్రగుంట్ల మండల కాంగ్రెస్ ఇంచార్జ్ జయరాం రెడ్డి, కాంగ్రెస్ నాయకు లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచినీటి బోరుకు మరమ్మతులు

### వార్తకు స్పందన

చాపాడు మే 13, ప్రభాతవార్త



మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్సుఫర్మర్ తో పాటు , త్రాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలోని ప్రజలు మంచి నీటికి ఇబ్బంది పడ్డారు. పట్టించు కునే వారెవరు" అన్న శీర్షికతో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించిశనివారం మంచి నీటి బోరు మరమ్మతులు చేసి త్రాగు నీటిని అందించడంతో ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బెస్తల శంఖారావం పేరుతో పోరుబాట

### బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



నాలుగు సంవత్సరాలుగా బెస్తల సమస్యలపై స్పందించకుండా ఆర్థికంగా కుంగ దీస్తున్న జగన్ సర్కారుపై ఈనెల 18వ తేదీ నుంచి దశల వారీగా పోరు బాట నిర్వహిస్తున్నామని మాయ మాటల తో బీసీలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీ వర్గాలను అణగదొక్కుతున్నారని బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ మండిపడ్డారు. శనివారం కడప తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్తల సమస్యలపై ఇప్పటికే పలు రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం ధారుణమన్నారు. బెస్తలపై ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి బెస్త కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి, మత్స్య సహకార సంఘాలకు చేసింది శూన్యమని గతంలో మాదిరిగానే పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బెస్తల శంఖారావం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేసేందుకు పోరుబాట పట్టనున్నామన్నారు. కార్యక్రమంలో బెస్త సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు మానా చంద్రశేఖర్, సాయి, జగదీష్, వర్ధిబోయిన రాము పాల్గొన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమా వేశం లో ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుమంత్‌కుమార్ మాట్లాడుతూ కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీతో విజయ కేతనం ఎగురవేసిందన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, మతోన్మాధ చర్యలు చేసినా అధికార దుర్వినియోగం చేసి మంచినీళ్ల ప్రాయంగా డబ్బు ఖర్చు పెట్టినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేరుస్తుందని మత ప్రమేయం లేకుండా సెక్యులర్ విధానాలు పాటించి అందరికి సమ న్యాయం చేస్తుందన్నారు. రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ప్రభుత్వ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువై మంచి పరిపాలన అందిస్తుం దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేశు, జిల్లా ప్రధాన కార్యదర్శులు అయ్యవారయ్య, కదిరి ప్రసాద్, లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, బండెల ఓబయ్య పాల్గొన్నారు.

## డీఎస్పీకి బైబిల్ బహూకరించిన పాస్టర్ మహేష్

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



కడప నగర డీఎస్పీ ఎండీ షరీఫ్‌కు 48వ డివిజన్ కృపా కాలనీకి చెందిన న్యూనేటీవ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కుటుంబ సమేతంగా సంఘ సభ్యులతో కలిసి శనివారం గౌరవపూర్వకంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరిశుద్ధ బైబిల్ గ్రంథాన్ని అందిం చి ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందని పాస్టర్ మహేష్ తెలిపారు. నగర ప్రజలు సమస్యలతో తమరి వద్దకు వచ్చినప్పుడు సహృదయంతో విని పేద వారిని ఒత్తిళ్లకు గురిచేయకుండా కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని విన్నవించారు.

## బిజెపికి ప్రజలు గుణపాఠం చెప్పారు : సిపిఐ

మదనపల్లె, మే 13 ప్రభాతవార్త :

కర్నాటక రాష్ట్ర ఎన్నికల్లో ప్రజలు భారతీయ జనతాపార్టీకి తగిన గుణపాటం చెప్పారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో కూడా ప్రాంతీయ పార్టీలు బిజెపితో అంటకాగడం మానుకొని ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ముందుకు పోవాలన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తమ అవకాశ వాదులతో బిజెపితో కలసి అంటకడుతున్నాయన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ది చెప్పాలన్నారు.

## 6న మైదుకూరు మండల సాధారణ సమావేశం

మైదుకూరు మే 13, ప్రభాతవార్త

మైదుకూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం16వ తేది మంగళవారం మధ్యాహ్నం గం3:30 నిమిషాలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. కులాయమ్మ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ తమ తమ శాఖకు సంబంధించిన వివరములతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## ఘనంగా హనుమత్ జయంతి మహోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు క్రైం, మే 13, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు ఆశ్రమంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి హనుమత్ జయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీప్రతాప స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకా దశ వార రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమత్ ప్రదక్షణ, రామ నామజపం, భజన ఉంటుందన్నారు. భక్తాదులందరూ తప్పక పాల్గొని హనుమత్ కృపకు, శ్రీరామ కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఎస్టీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె, మే 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కన్నయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3వ తరగతిలో 40 మంది, 4, 5 తరగతుల్లో 37 మంఠ, 6లో 28, 7లో 21, 8లో 27 మంది, 9లో 19 ఖాళీలు ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఎంపిక లాటరీ పద్ధతిలో ఉంటుందని అదే విధంగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

## వర్షానికి వడి వడిగా ఉపాధి అడుగులు

తంబళ్లపల్లె, మే 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో గత గురువారం కురిసిన వర్షానికి ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ వక్కావారి పల్లె సమీపంలోని గుట్టల్లో ఉపాధి హామీ పనులకు కూలీలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా ఎర్రసానిపల్లె పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 60 మందికి పైగా కూలీలు బోడిగుట్టలో కందకాలు, నీటి పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వ గుంతలు పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీవో రామన్న, ఉపాధి పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వర్షం పడిన ప్రాంతాల్లో కందకాలతో పాటు చెరువులు, కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. దీంతో పాటు మూగజీవాలకు తాగునీటి కోసం ఇంకుడు గుంతలు, సాగునీటి వనరుల ఆయకట్టులో కాలువల నిర్మాణం పనులు చేపడతామన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

### – ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



పర్యావరణాన్ని పరిరక్షించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని చేపట్టిన మిషన్ లైఫ్ ప్రపంచ ప్రజా ఉద్యమంలో భాగంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం కడప వారు శనివారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. పర్యావరణ వేత్తలు, ఎన్‌జీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, పరిశ్రమల వారు, సామాన్య ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి మన రోజు వారి జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు, పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

## కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా గుడ్ మ్యానర్స్

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



కడప నగరంలోని కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా జీసీ వీధిలో ఉన్న గుడ్ మ్యానర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులు ఇటీవల విడుదల అయిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించారని పాఠశాల కరస్పాం డెంట్ ముఫ్తీ రహీముల్లాఖాన్ ఖాష్మి, హెడ్ మాస్టర్ షేక్ అబ్దులై షకూర్ తెలిారు. 600 మార్కులకు గాను 549 మార్కులు సాధించిన ముజామిల్ అహ్మద్ స్కూలు మొదటి ర్యాంకు సాధించారని తెలిపారు. అదే విధంగా 517 మార్కులు అస్మా, 501 మార్కులు అబ్దుల్లా సాధించారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా వంద శాతం ఉత్తీర్ణతతో మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

## ప్రారంభమైన శ్రీగాలిదేవర ఆంజనేయస్వామి ఉత్సవాలు

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



పాత బస్టాండు దగ్గరలో వెలసిన శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి దేవా లయం లో 12వ తేదీ నుంచి హనుమజ్జ యంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చలపతి, సానె శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ గాలిదేవర ఆంజనేయ స్వామి 2000 సంవత్సరం నుంచి భక్తులను అనుగ్రహిస్తూ సకల శుభాలను అందజేస్తున్నారని 2006లో ప్రతిష్ట చేపట్టినప్పటి నుంచి ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి నాడు హనుమజ్జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శనివారం ఉదయం కలశ పూజ, కలశ హోమం, మంత్ర పుష్పం, నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం మహాభిషేకం, పల్లకి సేవ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరిగిం దన్నారు. చెన్నూరు శ్రీరామ భజన మండలి వారి హనుమాన్ చాలీ పారాయనం, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారి హరికథా గానం, చిన్నమాచుపల్లె గ్రామం చెన్నూరు వారి హరి భజనలు జరిగాయన్నారు. 14వ తేదీ ఆదివారం విశేష అలంకరణ, మంత్ర పుష్పం, నైవద్యం, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వినియోగం జరుగుతుందన్నారు.

## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన అమీర్‌బాబు

కడప వైద్యవిభాగం, మే 13, ప్రభాతవార్త:



కువైట్ అల్‌రాజి హాస్పిటల్‌లో కడప నగరానికి చెందిన రియాజ్ అహ్మద ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కడప నగర తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు, గోవర్ధన్ రెడ్డి, నాయకులు బాధి తున్ని శనివారం పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. కార్యక్రమంలో కువైట్‌లో ఉన్న తెలుగు దేశం పార్టీ నాయకులు రహంతుల్లా, ముస్తాక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రోక్రాన్ 2పై అవగాహన కార్యక్రమం



చిట్వేలి, మే 13 ప్రభాతవార్త

30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి లెపె ్టనంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాప ఆదేశాల మేరకు ప్రోక్రాన్ 2 విజయోత్సవాల సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ అనుశక్తి ప్రోక్రాన్ 2 పరీక్షలు సైన్య రంగంలో అనుశక్తి ఉపయోగం తదితర వాటిపై ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుశక్తిని విద్యుత్పత్తి, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఆహార సం రక్షణ, పరిశ్రమ, పరిశోధన తదితర శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయో గించినప్పుడే ప్రపంచ ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగే విచ్చేసిన చిట్వేలి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులు అంటే క్రమశిక్షణకు మారు పేరు అని, నిజ జీవితంలో సైన్యంలో అనుశక్తిని ఏవిధంగా ఉపయోగించాలో ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు దుర్గరాజు, కానిస్టేబుల్ సుధాకర్, కిరణ్‌కుమార్‌రాజు, ఎన్‌సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శవనవారిపల్లెలో నీటి సమస్య పరిష్కారానికి ఆకేపాటి హామీ

రాజంపేట అర్బన్, మే 13

ప్రభాతవార్త



శనవారిపల్లెలో నీటి సమస్యను అమర్‌నాథ్‌రెడ్డికి తెలియజేస్తున్న గ్రామస్థులు

మండలంలోని శవనవారిపల్లె దళితవాడలో నీటి సమస్య పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. తమ గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు జడ్‌పి ఛైర్మన్‌ను కలిసి వివరించారు. అందుకు స్పందించిన అమర్‌నాథ్‌రెడ్డి వెంటనే అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించేందుకు తనను కలిసిన పార్టీ నాయకులకు హామీ ఇచ్చారు.

## వేగవంతంగా కూరగాయల మార్కెట్ నిర్మాణం

### ధ్వజారెడ్డి, సాయిలు

రైల్వేకోడూరు రూరల్, మే 13

ప్రభాతవార్త



60 సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరిన కోడూరు కూరగాయల మార్కెట్‌ను ఇటీవల పాత నిర్మాణాన్ని తీసివేసి కొత్త నిర్మాణాన్ని వేగవంతంగా చేపడుతున్నట్లు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయిలు అన్నారు. శనివారం వారిరువురు కూరగాయల మార్కెట్‌కు నిర్మాణ పనులను పరిశీలించారు. వ్యాపారులకు అనువుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని వారు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి ఆకాంక్షించే విధంగా ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే నిర్మాణం పూర్తిచేసి కూరగాయల వ్యాపారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భుజంగేశ్వరదేవాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, యోగానంద్, ఇఒ రామసుబ్బారెడ్డి, వైసిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## పథకాల పట్ల ప్రజలు భేష్

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, మే 13

ప్రభాతవార్త



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం మొదటి వార్డులోని పగడాలపల్లెలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పంజం సుకుమార్‌రెడ్డి, ధ్వజారెడ్డి, సాయిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు ఎలా ఉన్నాయి? పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయంపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏవైనా పథకాలు చేరకుండా ఉండి ఉంటే తక్షణమే సంబంధిత అధికారులతో చర్చించి ఇక్కడే ఆ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రైతు సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, కన్వీనర్ సుధాకంరాజు, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, గోపి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, శ్రీరామ్‌వినోద్, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, రాజా, వైఎస్ కరిముల్లా, రవూఫ్, బుల్లెట్ శివ, రమణారెడ్డి, రాజారెడ్డి, పలువురు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి - కేసు నమోదు

కడప క్రైం, మే 13, ప్రభాతవార్త:

కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో ఈనెల 8వ తేదీ ఆధార్‌కార్డులో సెల్‌ఫోన్ నెంబరును అప్‌డేట్ చేయించుకోవడానికి వెళ్లిన పి.వెంకట శివకుమార్ (53) అనే వ్యక్తిపై బ్యాంకు ఉద్యోగి విశ్వనాథ్ ప్రింటర్‌తో తలపై కొట్టి గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పి.వెంకట శివకుమార్ కరూర్ వైశ్యాబ్యాంక్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ వీఆర్‌ఎస్ తీసుకున్నారు. ఆయన ప్రస్తుతం తన భార్య, పిల్లలతో వివేకానందనగర్‌లో ఉంటున్నారు. ఆయన తన భార్యతో కలిసి సోమవారం ఆదార్ కార్డులో సెల్ నెంబర్ అప్‌డేట్ కోసం వెళ్లారు. అక్కడ పని చేస్తున్న అశ్వని అనే ఉద్యోగి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితుడు వారి మేనేజరుకు ఫిర్యాదు చేశారు. అశ్వని తరుపున విశ్వనాథ్ అనే ఉద్యోగి వత్తాసు పలుకుతూ వెంకట శివకుమార్‌పై ప్రింటర్‌తో దాడి చేశారు. బాధితుడి నుదుటిపై గాయం కావడంతో ఆయన రిమ్స్‌లో చేరారు. వైద్య సేవలను పొందిన తరువాత శనివారం కడప వన్‌టౌన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్సై రంగస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కువైట్‌లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు

రాజంపేట అర్బన్, మే 13

ప్రభాతవార్త



కువైట్‌లో తెలుగుదేశంపార్టీ ఎన్‌ఆర్‌ఐ కమిటి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను కువైట్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ తెలుగుదేశం కువైట్ అధ్యక్షుడు నాగేంద్రబాబు అక్కిలి, గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాధాక్రిష్ణ, సభ్యులు వెంకట్ కోడూరి, ప్రధాన కార్యదర్శి మారోతు మల్లి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి వెంకటేశ్వర్‌రావు, టిడిపి కడప జిల్లా నేతలు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, ఎస్.అమీర్‌బాబు, బద్వేల్ ఇన్‌ఛార్జి కె.రితేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లె ప్రతాప్‌రాజు, మదనపల్లె నియోజకవర్గ నేత రామినేని జయరామయ్యనాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సజ్జా అజయ్, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు టి.నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ మహాపురుషుడని వారు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించేందుకు ప్రతిఒక్కరు అంకితభావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం వైకోట గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తెలుగుదేశం నేతలు బ్రహ్మాండమైన విందును ఏర్పాటు చేశారు.

## మండెం లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం, మే 13ప్రభాతవార్త:



మండలంలోని దేవగుడిపల్లి గ్రామంలో జిల్లా వాండ్లపల్లె సమీపంలో మాండవ్య నది ఒడ్డున వెలసిన మహామాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. ప్రతి శనివారం ఇక్కడికి మండల వాసులే కాక వివిధ ప్రాంతాల నుండి భక్తులు వస్తారు. వారిచే ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహింపచేసి, పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు.. దేశ రాజకీయాల్లో మలుపు

వేంపల్లె, మే 13, ప్రభాతవార్త :



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు, బీజేపీ ఓటమి పట్ల మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచినందుకు బాణసంచాపేల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం దేశ రాజకీయాల్లో, తెలుగు రాష్ట్రాలపై గణనీయంగా ఉంటుందన్నారు. ఈ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే రాజస్థాన్, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై కూడా కర్ణాటక ఎన్నికల ప్రభావం ఉంటుందన్నారు. వచ్చే సంవతసరం జరగబోయే లోక్‌సభ, ఏపీ మీద కూడా తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అటు రాష్ట్రంలో, ఇటు దేశంలో పూర్వవైభవం, మహర్దశ వస్తాయని, చరిత్ర పునరావృతం అవుతుందని తులసిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామక్రిష్ణ, చెన్నకేశవ, నరసింహారెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, వెంకటేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## పాలేటమ్మ తిరుణాల దర్శించుకున్న టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మే 13ప్రభాతవార్త:



మండలంలోని కలిబండ గ్రామంలో శనివారం జరిగిన శ్రీపాలేటమ్మ తిరుణాల సందర్భంగా టిడిపి నియోజకవర్గపు నాయకుడు మండిపల్లి రా ంప్రసాద్‌రెడ్డి గ్రామస్తుల పిలుపుమేరకు కలిబండ గ్రామంలో ఇం టింటికి తిరిగి ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలను చల్లంగా చూడమ్మఅంటూ మొక్కుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు

### నేడు అభహస్త ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు

రామాపురం, మే 13ప్రభాతవార్త:

మండలంలోని సుద్దమల్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో ఆదివారం శ్రీరామదూత అబహస్త ఆంజనేయస్వామి హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం గణపతిపూజ స్వస్తి వాచనం, కల్పస్థాపన ఆంజనేయ మూలమంత్ర జపం, పంచామీత అభిషేకం, పూజలు, ఆకుల పూజలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించబడతాయన్నారు. 11 గంటలకు మంగలహారతి, తీర్థప్రసాద వినియోగం జరుపబడుతాయని, తదుపరి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామ ప్రజలు కాకుండా మండలంలోని పలు గ్రామాల ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

## వైభవంగా ప్రారంభమైన హనుమంత్ జయంతి వేడుకలు



బద్వేలు అర్బన్, మే 13 ప్రభాతవార్త

హనుమజ్జయంతి పురస్కరించుకొని శనివారం సిద్ధవటం రోడ్డు ఫైర్ ఆఫీసు వెనుక వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంకాలం స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని శాస్త్రవేత్తంగా నిర్వహించారు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి అభిషేకాన్ని తిలకించి స్వామివారికి కాయ కర్పూరం సమర్పించుకుని తమ మొక్కలను తీర్చుకున్నారు. నేడు జరగబోయే హనుమాన్ జయంతికి అవసరమైన స్వామివారి పూల అలంకరణకు పలువురు మహిళలు పాల్గొని స్వామివారి పూలను కట్టారు, ఈ కార్యక్రమంలో పత్తి పుష్పలత పబ్బతి శ్రీదేవి ముచ్చర్ల సుజాత వల్లంకొండు ధనలక్ష్మి గొడిసిపాటి రుక్మిణి మేడ హైమావతి తుమ్మలపెంట ప్రభావతి చెక్క లక్ష్మీదేవి సృజన, తుంగ శుభ రత్నమ్మ తో పాటు గొడిసిపాటి అంకయ్య తాతనబోయిన వెంకటసుబ్బయ్య, తుంగ శేషయ్య మాడపురు వెంకటరమణ కంచర్ల గంగిరెడ్డి పోకల నాగేశ్వరరెడ్డి బంటు, ఉపాధ్యాయులు చింతకుంట కృష్ణమూర్తి పబ్బతి చక్రపాణి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు తో పాటు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 104 ఉద్యోగులు నిరసన

నందలూరు, మే 13 ప్రభాతవార్త



నందలూరు మండలంలోని 104 కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు నందలూరులోని 104 సిబ్బంది నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరై తమ డిమాండ్ల ప్లకార్డులను నిరసన ప్రదర్శించడం జరిగింది. ఇందులో భాగంగా పైలెట్ హరి, డిఇఒ గోవర్ధన్‌లు పాల్గొని ఉద్యోగ భద్రత కల్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పిలుపు మేరకు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## రాజంపేట అర్బన్ ఎస్ఐ పేరుతో సామాజిక మాధ్యమాల్లో అక్రమ వసూళ్లు

రాజంపేట అర్బన్, మే 13 ప్రభాతవార్త

సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకొని ఏకంగా పోలీసుల పేరు చెప్పి కూడా సొమ్ము దండుకొనేందుకు కొందరు ప్రయత్నాలు చేవారు. కొంతమంది మోసపోయారు కూడ. అయితే ఈ విషయాన్ని త్వరితగతిన రాజంపేట అర్బన్ సిఐ నరసింహారావు ప్రజలు మోసపోవద్దని ఒక పత్రికా ప్రకటన శనివారం విడుదల చేశారు. కొంతమంది వ్యక్తులు పోలీసువారి ఫొటోలను, రాజంపేట ఎస్ఐ అని పరిచయం చేసుకొని అత్యవసరంగా డబ్బు అవసరం ఉందని చెప్పి వాట్సాప్ ద్వారా అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సిఐ పేర్కొన్నారు. రాజంపేట పోలీసులకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని, ఎవరు కూడా ఫోన చేసి డబ్బు అడగలేదని, ఎవరో పోలీసువారి పేరు చెప్పి మోసం చేసేందుకు డబ్బులు అడుగుతున్నారని పేర్కొన్నారు. డబ్బు పంపిస్తే మోసపోతారని ఎవరైనా ఫోన్‌చేస్తే 9121100569, 9121100570, 9121100571 నంబర్లకు ఫోన్ చేసి తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సిఐ నరసింహా రావుపై డిఎస్పీకి ఫిర్యాదు

రాజంపేట, మే 13 ప్రభాతవార్త :



భాధితుడు పై దుర్భుగా ప్రవర్తించిన రాజంపేట టౌన్ సి. ఐ. నరసింహ రావుపై శనివారం రాజంపేట పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు న ఉన్న శిల్పి రాజచారి డి. ఎస్. పి. చైతన్య కు పిర్యాదు చేశారు. ఈ పిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు నెలల క్రితం జరిగిన గొడవకు సంబంధించిన కేసు శని వారం జరిగే లోక్ ఆధాలత్‌లో రాజీ కావాలాన్నారు. దీనికి అంగీకరించక పోవ డంతో, స్టేషన్‌లో నాపై చేయి చేసుకొని చెప్పడానికి కూడా వీలు లేని పదజాలంతో తిట్టి నామనసును గాయపచారన్నారు. ఇదే కాకుండా నాపై తప్పుడు కేసులు బనాయిస్తా నని బెదిరించి నన్ను భయబ్రాంతులకు గురించేస్తున్నారన్నారు. నాపై తప్పుడు కేసులు బాణాంచకుండ కాపాడాలని డి.ఎస్.పి, కోరారు. దీంతో ఆయన బాధితునికి నీపై ఎలాంటి తప్పుడు కేసులు బాణాయించకుండా తగు చర్యలు తీసుకొని న్యాయం చేస్తానని బాధితునికి భరోసా ఇచ్చారు.

## అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా నేడు బండలాగుడు పోటీలు, హరిశ్చంద్ర నాటకం

కాశినాయన, మే 13 ప్రభాతవార్త :

మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వెలసి వున్న పురాతన శ్రీశ్రీ అభయాంజనేయ స్వామి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితులు జయంతి సందర్భంగా 14వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయిలో బండ లాగు పోటీలు మరియు హరిశ్చంద్ర నాటకం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.యస్.నారాయణ రెడ్డి, సంఘ సేవకులు, గ్రామ సర్పంచ్ ముత్తుముల రాజ నారాయణ రెడ్డి ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం వచ్చిన భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నట్లు, ఎండను దృష్టిలో ఉంచుకొని వచ్చే భక్తులకు భారీగా చల్లని మజ్జిగ ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సీనియర్ ఎద్దులచే బండలాగుడు కార్యక్రమంలో మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి 70 వేల రూపాయలు, మూడవ బహుమతి 40 వేల రూపాయలు, నాల్గవ బహుమతి 20 వేల రూపాయలు, అలాగే వచ్చిన ప్రతి జత వృషభరాజములకు ప్రోత్సాహక బహుమతి ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఉదయం ఆకు పూజతో మొదలుకొని అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఉదయం 9 గంటల నుండి నటరాజ చెక్కభజన, కులుకు భజన, గురువులు భజన పుల్లయ్య, ప్రసాద్ వారిచే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. శ్రీశ్రీ అభయాంజనేయ స్వామి భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## కాంగ్రెస్ విజయం భవిష్యత్తుకు సంకేతాలు

### - యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మహబూబ్ బాష

బద్వేలు అర్బన్, మే 13

ప్రభాతవార్త :



బద్వేలు నియోజకవర్గంలోని బద్వేలు ప్రాంతంలో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో 130 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచి ఘన విజయం సాధించిన సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మహబూబ్ బాష మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం పట్ల రానున్న దేశ రాజకీయాలకు ఇది ఒక శుభ సూచకం అని, కాంగ్రెస్ శ్రేణులలో నూతనోత్సాహం వెలిబుచ్చుతుందని, యువ నేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో పార్టీకి కొత్త జవసత్వాలు నింపబడ్డాయన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ హుస్సేన్ బాష, మహమ్మద్, సయ్యద్, షాబుద్దీన్, ఫైరోజ్, అహమ్మద్, దౌలాత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు జీవన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 109 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె, మే 13,

ప్రభాతవార్త:



తంబళ్లపల్లె న్యాయస్థానంలో శనివారం జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 109 కేసులు పరిష్కారమై రూ.15,29,051 రికవరీ అయినట్లు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఆసీఫా సుల్తానా తెలిపారు. ఉదయం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో సీసీ (ఐపీసీ) 13, ఎస్ఐసీ (ఎన్ఐటీ) 1 రూ.2,28,000, ఓఎస్ (మనీ) 2 ఓఎస్ (పిటీషన్) 1, ఓఈఎస్ 1 రూ.12,66,151, మొత్తం 18 సీసీ (అడ్మిషన్) 4 రూ.13900, ఎస్‌టీసీ సెకెండ్ క్లాస్ 84 రూ.16,800, ఎస్‌టీసీ 9 (1) కానింగ్ 3 ఫైన్ రూ.4200, స్పెషల్ 18020 మొత్తం 109 కేసులు రూ.15,29,051 రికవరీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది స్థానిక కోర్టు సిబ్బంది మరియు హాజరైన కక్షిదారులకు వైద్య సేవలు అందించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుతో ఒంటిమిట్టలో సంబరాలు

ఒంటిమిట్ట, మే13, ప్రభాతవార్త:



కర్ణాటక ఆసెంబ్లీ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాదించడంతో ఒంటిమిట్టలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సోమిశెట్టి మనోహర్‌బాబు ఆద్వర్యంలో సంబరాలు జరుపుకున్నరు. ఈసందర్భంగా మనోహర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ 136 స్దానాల్లో విజయం సాదించి కొత్త ప్రభంజనం సృష్టించిందన్నారు.1978 లాగా రాజకీయ సునామి ప్రారంభమయిందాన్నరు.బారీగా టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కడప పట్టణ కాంగ్రెస్‌పార్టీ ఆద్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఆద్యక్షుడు లక్ష్మయ్య. మండల కాంగ్రెస్ ఆద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనువాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## రాజీమార్గమే రాజ మార్గం

### జూనియర్ న్యాయమూర్తి కె.లత

నందలూరు, మే 13

ప్రభాతవార్త



నందలూరు కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఛైర్మన్ కె.లత నిర్వహించారు. ఇందులో భాగంగా 530 కేసులకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలియజేశారు. సివిల్ కేసుల్లో రూ.12,05,332, క్రిమినల్ కేసుల్లో రూ.7,30,700 పరిష్కరించి ఫిర్యాదుదారులకు ఇప్పించడం జరిగిందని, ఇతర క్రిమినల్ కేసుల్లో రూ.2,30,670 ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందని తెలియజేశారు. పిఎల్‌సి కేసుల్లో రూ.6,55,000, మొత్తం రూ.6,55,000 పరిష్కారం చేయడం జరిగిందని తెలియజేశారు, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు లోన్ కేసులు మొత్తం రూ.2,93,798 తగ్గించి 3 కేసులు పరిష్కరించారు. వీటిల్లో ఒక్క కేసులో రూ.45 వేలు, 2 కేసుల్లో రూ.1.36,109, 3వ కేసులో రూ.1,12,577 రూపాయలు తగ్గించి కేసులు పరిష్కరించి లబ్దిదారులకు లబ్ది కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, నందలూరు, పెనగలూరు, పుల్లంపేటకు సంబంధించి సిఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, పిఎల్‌విలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

### - జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్



బి.కొత్తకోట, మే 13, ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణంలో అలసత్వం వదిలి యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బి.కొత్తకోట కురవానికుంట లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. లబ్ధిదారులు జగనన్న కాలనీలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా అధికారులు వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో లే అవుట్‌ను పరిశీలించి అక్కడ మొత్తం ఎన్ని ప్లాట్లు ఉన్నాయని మరియు ఎన్ని ఇళ్లు మంజూరు చేశారని సంబంధిత హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు సౌకర్యాలపై ఆయా శాఖాధికారుల దృష్టి సారించి శరవేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సౌకర్యం అందించడానికి ఐకేపీ అధికారులు చొరవ చూపాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొంది పక్కా ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు కచ్చితంగా ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. ఆయన వెంట మదనపల్లె ఆర్డీవో మురళీ, ఎంపీడీవో, తహసీల్దార్, హౌసింగ్ డీఈ శ్రీహరి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన జాతీయ లోక్ అదాలత్

### పరిష్కారమైన 317 వ్యాజ్యములు

బద్వేలు లీగల్, మే 13 ప్రభాతవార్త : భారత అత్యున్నత న్యాయ స్థానం ఆదేశానుసారం రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం సూచనల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం బద్వేలు న్యాయస్థాన పరిధిలో జాతీయ లోక్ అదాలత్ ఛైర్మెన్, మండల న్యాయ సేవాధికార సంస్థ, బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. ఇందులో 1,10,13,118 రూపాయలు విలువ గల 317 వ్యాజ్యములు అనగా క్రిమినల్-289 (రూ.55,000/-లు), సివిల్-28 (రూ.1,09,58,118/-లు) రాజీపడదగ్గ వ్యాజ్యములు పరిష్కారమయ్యాయి. ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ మూడు బెంచీల వారీగా ఏర్పాటు చేయడం జరిగినది. మొదటి బెంచ్ యం.కాశీ విశ్వనాధాచారి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, బద్వేలు, రెండవ బెంచ్ బి.గాయత్రి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, బద్వేలు, మూడవ బెంచ్ సోమేసుల శివ ప్రసాద్, జుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అధ్యక్షతన కార్యక్రమం జయప్రదమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీపడదగ్గ యావత్తు వ్యాజ్యములు మున్ముందు కూడా ఇదే వైనాన పరిష్కరించుకొనవలసినదిగాను, న్యాయ స్థానాల సమయాన్ని వృధా కాకుండా కాపాడవలసినదిగాను, ఇందుకై ప్రతి ఒక్క కక్షిదారుడు బాధ్యత వహించులాగుననూ, న్యాయవాదులు మరియు పోలీసు అధికారులు, మేధావులు సహితము కక్షిదారుల మధ్య రాజీ మార్గమును ఏర్పరచి సత్వర న్యాయ పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ద్వారా మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, మేధావులు, బెంచ్ మెంబర్లు, న్యాయవాద గుమస్తాలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

